#  చల్లని తల్లి 

శ్రీ భమిడిపాటి వెంకటరమణ

రామారావు గుమస్తాగిరిలోనూ గృహస్థాశ్రమంలోనూ ప్రవేశించి ఏడాది పైబడింది. ఈరోజే కుమారుణ్ణి తీసుకొని భార్య పుట్టింటినుంచి తిరిగొచ్చింది తన యింటికి. రామారావు ఆనందానికి మేర లేదు. బ్రహ్మానందంతో తన కొడుకుని చూపించడానికిగానూ బంధువుల్ని స్నేహితుల్ని ఆహ్వానించి విందు చేశాడు. దినమల్లా క్షణం తీరిక లేకపోయింది. రాత్రి కాగానే బంధువులు స్నేహితులు అందరూ వెళ్ళిపోయిన తరువాత తన కొడుకుని మనసార ముద్దులాడి నిద్రపోయాడు. అర్ధరాత్రప్పుడు అతన్ని ఎవరో తట్టి లేపినట్టయింది లేచాడు. గుండెల్లో ఏదో బిగబట్టినట్టు - చల్లగా ఒళ్ళు ఝల్లుమనిపించేలాగ - ఎవరది?

"నన్నే మరచిపోయావా నాయనా!" గలగల నవ్వుతూ చలిపుట్టించేలాగ.

"అమ్మా!"

"అవును. నేనూ అమ్మనే. నిన్ను ఈ లోకంలోకి తీసుకొని వచ్చేది అమ్మ అయితే తీసుకొనిపోయేదీ కూడా అమ్మే?"

"మృత్యువు!"

"భయమేసిందా?"

"భయమెందుకు?"

"నిన్ను తీసుకొనిపోతానేమోనని."

"ఆ భయం నాకు ఎన్నడూ లేదు. నాకు తెలుసు, నువ్వు ఎలాగూ ఒకనాడు, తీసుకొనిపోతావని. కాని నా గడువు తీరవద్దా?"

"గడువా? నన్ను అడ్డుపెట్టగలిగేదా?"

"నా బాధ్యతలు చూడు. చిన్న భార్య, చంటిపిల్లడు."

"ఇవి మాత్రం నన్ను అడ్డుతాయా పిచ్చి కాడా?"

"నీకు దయలేదా?"

"దయా, లేకేం బోలెడంత వుంది - నీమీద."

"మరి నా ఆత్మబలం, ఆశయాలు, కర్తవ్యం?"

"ఇవేవీ నన్ను ఎదిరించలేవు"

"నాశక్తి, నా శరీరంలో ఉండే నాశక్తి!"

రామారావు ఒకసారి తన ఛాతీ పొంగించి ఒళ్ళు చూసుకున్నాడు. బలమైన కండలు ఆరడుగులఎత్తున నిలిచిన తన పచ్చని శరీరం. శూన్యంలోనూ, అంధకారంలోనూకూడా చీల్చుకొని చూడకలిగే తనకళ్ళు. పిల్లగాలిలోని సుడులనుకూడా వినగలిగే తన చెవులు. గంటలతరబడి పరిశ్రమించగలిగే తన అవయవాలు. ధర్మాధర్మాల మర్మాలు ఎరిగే తన మేధస్సు. వీటన్నింటితోనూ తను మృత్యువుని ఎదిరించలేడా?"

"నా సంపూర్ణశక్తితో నిన్ను ఎదుర్చుతాను! నన్ను తీసుకొని వెళ్ళగలవా నేను రాదలచనప్పుడు?"

"అంత భయపడతావెందుకు? ఒక్కసారి నీకు జ్ఞాపకం చేసిపోదామని వచ్చాను. కొడుకు పుట్టాడన్న సరదాలో నన్ను మరిచిపోయినట్టున్నావని."

"మరువక నిన్ను తలచుకొని ఈ ఆనందాల్ని వేడుకల్ని పాడుచేసుకోమంటావా?"

"నన్ను మరచిపోవద్దంటాను"

"నిన్ను మరచిందెప్పుడు? మరువగలిగిందెలాగు? నిన్ను అనుక్షణమూ జ్ఞప్తియందుంచుకునే మేము జీవించేది. మరచినట్టు పైకి కనుపించినా మాలో నీజ్ఞాపకమే నిండివుంటుంది. వేసే ప్రతిఅడుగూ, చేసే ప్రతీ పనీ, ఆరగించే ఆహారం, భద్రతలోనూ నిద్రలోనూ నీవే జ్ఞాపకం నీకా సందేహం ఎందుకు?

"నా సంతానాన్ని నేను ఒకకంట కనిపెడ్తూవుండవద్దామరి! నేను వస్తాను"

వెచ్చనిగాలి శరీరానికి సోకింది. రామారావుగుండె తేలిక అయింది. గదిలో మంచమ్మీద నిద్రపోతున్న భార్యను కొడుకును ఒకమారు చూశాడు. వీళ్ళకు తన అవసరం వుంది. ఇది సత్యం. వీరియెడల తన బాధ్యత తీరేవరకు తనకు గడువుకావాలి.

* * *

ఆరోజు - తన రెండవ కొడుకు నామకరణ మహోత్సవం చేసి బంధువులతో విందారగించి లేచాడు రామారావు. తన యింటికి మరింత, శోభ చేకూర్చే పవిత్రదీపం తనకు లభించినట్టు ఆనందించాడు రామారావు. ఆ ఆనందంలో ఆయన స మరచిపోగలడు.

"నామాట మరచిపోయావే!" అని ఎవరో ప్రశ్నించినట్లయింది, చల్లగా గలగలా నవ్వుతూ గాలిలో.

"మృత్యువు!"

"కాదు, అమ్మ. ఇద్దరు కొడుకులు పుట్టారని అపరమిత ఆనందం పొందుతున్నావు నీకేం ప్రయోజనం?"

"నాకు ఏ ప్రయోజనం అక్కర్లేదు. నన్ను ఆశ్రయించుకునే వారికి. నా కన్నతల్లికి. గడువుండగానే కలిగిన బిడ్డలు నా గడువు తీరి నేను గతించగానే ఆమెకి రక్షకులవుతారుగదా. నాకు అప్పుడు ఒక బాధ్యత వదుల్తుంది."

"బాధ్యతలు వదిలేవరకు నువ్వు నాకు దూరమనే అనుకుంటున్నావు కదూ! అందుకా ఈ ఆలోచన చేస్తున్నావు?"

"నన్నుగురించి కాదు ఆలోచించేది. నిన్నుగురించే ఆలోచిస్తున్నాను."

"నన్నుగురించి ఆలోచించడానికి నీకిప్పుడు నిజంగా తీరికవుందా?"

"అవును. ఆమాట నిజమే. నా ఉద్యోగం, బాధ్యత, పిల్లలు, భద్రతగూర్చి ఎక్కువ ఆలోచించవలసి వస్తూంది. నా ఆలోచనలు భంగపరచవద్దు. ఇక పో!"

"నీ ఆలోచనలు భంగపరచడం నా ఉద్దేశంకాదు. ఒక్కసారి జ్ఞాపకం చేసిపోదామని."

"నువ్వెప్పుడూ నా జ్ఞాపకానికి దూరంకావు" సగం నిద్రలో రామారావు ఏమేమో పలికాడు.

* * *

"అన్నీ ఉత్తమాటలే? నన్ను నువ్వు పూర్తిగా మరచిపోయివుంటావు. కనీసం ఇప్పుడు కుమార్తె పుట్టిందన్న ఆనందంలోనయినా!"

"ఆమాట నిజమే! నా ఇంట్లో ఈనాటికి లక్ష్మీదేవి ప్రసన్నమయింది. నాయిల్లు కలకల్లాడుతూ అందాలు ఊరుతూ ఆటల్లో పాటల్లో మునిగి తేలుతూ వుంటుంది. ఇంతటి పరమానందం ఎవరు వాంఛిరపడు లభించినప్పుడు మైమరువని వాడెవ్వడు?".

"ఈ కబుర్లు అన్నీ నేను చెయ్యి చాచనంతవరకే?"

"నీ చెయ్యి నన్ను తాకగలదా? ఈ బీరువాలు, అద్దాలు, పెట్టెలు, సామగ్రి నానాటికి పెరుగుతూవుండే నా చుట్టుపక్కల పరివారం, బలగం నీ చెయ్యిని చాచనిస్తాయా నాదాక?"

"ఈ కర్రలు, కొయ్యలు నన్నేమీ ఆపలేవు. నీ శరీరం—"

"నా శరీరం - నీ చేతికి పట్టుబడేటంత బలహీనం యింకా కాలేదు."

"ఒక్కసారి చూడు ఆ రూపం, అద్దంలో. తేరిపారిచూడు. జుత్తు నల్లదనం దిగజారి తెల్లపడుతూంది. చూపులు లోపలికి ప్రయాణం చేస్తున్నాయి. ముఖంలో పూర్వపు మార్దవంపోయింది. ఇప్పుడు నీవంక ఎవరూ తిరిగి చూడవలెనని అభిలషించడం లేదుకదూ! నీ శరీరం కూడా చూసుకో ఊబదేరి ఎలా పైకి ఉబుకుతూందో!"

"లేదు. లేదు. నా శక్తి క్షీణించలేదు. ఆలోచనలతోనూ, ఆందోళనతోనూ జుత్తు తెల్లబడి ఉంటుంది. ఆలోచనల తీక్షణతే చూపుల్ని లోపలికి తీసుకెళ్తున్నాయి. వాతావరణమే ముఖాన్ని మార్చివేసింది. నా శరీరం తృప్తిఅయిన భోజనంచేసి పుష్టినెక్కింది. నిన్ను ఎదిర్చగలిగే శక్తి నాలో ఉంది. నువ్వు చెయ్యి చాచితే తప్పక ఎదుర్చుతాను"

"ఎందుకు?"

"ఎందుకా? చూడు. పెద్దవాడు చదువు సంధ్యల్లో పడ్డాడు. చిన్నవాడు లోకజ్ఞానంలో పడ్డాడు. పసిపాప ప్రాకటం మొదలెట్టింది. నా ఉద్యోగంలో హోదా హెచ్చింది. బాధ్యతలు బిగుసుకుంటున్నాయి. ఇప్పుడే నా సంపూర్ణమైన శ్రద్ధ, జాగ్రత్త అవుసరం"

"నేను వెళ్లిపోతాను"

గడ్డకట్టిన గుండె క్రమక్రమంగా కొట్టుకోవడం మొదలెట్టింది. శరీరం వేడెక్కింది. రామారావుకి తల్లిఒళ్లో పడుకున్న పసిపాప ప్రసన్నవదనం చూడగానే ప్రకృతిలో ఎంతో ప్రశాంతత పవిత్రతఉన్నట్టు అనిపించింది. అదే బ్రతుకులోఉండే సుహృదానందం. ఆలోచనలతో నిద్రకూడా వచ్చి ఆక్రమించింది రామారావుని.

* * *

రామారావుకి తీవ్రమైన జ్వరం వచ్చింది. కడుపులోనూ, గుండెల్లోనూ, తలలోనూ మంటలు మండుతున్నాయి. నాడులు లాగుతున్నాయి. కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి. ఇల్లు, వస్తువులు, భార్య, పిల్లలు, బంధువులు, స్నేహితులు క్రమక్రమంగా అదృశ్యమవుతున్నారు. అరె! ఏమిటిది? ఈబాధ? తన్నేంచేస్తుందో? ఎవరో తెలియకుండా తనని బాధిస్తున్నట్టుంది. మృత్యువు కాదు కదా! ఆక్షణంలో చల్లనిగాలిలో గలగల నవ్వు వినిపించింది. అదిగో మృత్యువు.

"అమ్మో! - " పెద్దకేక పెట్టాడు రామారావు

"ఇదిగో చూడు మా స్నేహితులందరికీ కబురుపెట్టు. మరి ఆశలేదు. ఇంటికి టెలిగ్రాం వేయించు. పిల్లల్ని ఇక్కడ్నుంచి పంపించేయి. భయపడ్తారు!"

"ప్రేలాపన జ్వరతీవ్రతలో అలాగే ఉంటుంది. మరేమీ భయంలేదు" అన్నారు పక్కన నిలబడ్డవారు. రామారావు చెవులో ఆమాటలు పడ్డాయి.

"మీకు తెలియదు. నిజంగా మృత్యువు నా ఎదుట వచ్చి నిలిచివుంది."

"భయపడకండి. డాక్టరుకోసం కబురు పంపాను. ఆయన వస్తూవుంటారు ఈపరికి."

"డాక్టరెందుకు? ఇప్పుడు వచ్చి ఆయనేం చెయ్యాలని? మృత్యువుతో సెయ్యగలడా?"

ప్రేలాపన ఎక్కువయింది.

"నేను అనుకున్నట్టే అయింది. గోంగచాటున దెబ్బతీశావు. నా శరీరం అనారోగ్యంగా ఉన్నప్పుడు అయితే సుళువుగా తీసుకొని పోవచ్చునని నీ ఊహ!"

"నేను నిన్ను తీసుకొని పోవడానికి రాలేదు. నువ్వు భయపడవద్దు!"

"అయితే మరెందుకు వచ్చినట్టు?"

"నువ్వు నన్ను తలంచుకున్నావు గదా అని. సంతానం తలుచుకుంటే తల్లి ఎంత దూరంలో ఉన్నా పరుగెత్తుకొని వస్తుంది!"

"మరయితే ఈ బాధ?"

"ఇది రోగం? ఇది నిన్ను కొంచెం బాధ పెట్టుంది. నిజమేగాని నిన్ను తీసుకొని పోదు!"

"నన్ను తీసుకొని పోనివ్వను!"

డాక్టరుగారు వచ్చారు. ఒక ఇంజక్షన్ ఇచ్చారు. "టెంపరేచరు ఎక్కువగాఉంది తడిగుడ్డ తలకు చుట్టండి. ఆరార నీళ్ళతో తడుపుతూ వుండండి. త్రాగడానికి కావలసినంత నీరు పొయ్యండి" అని చెప్పారు

"ఈమాత్రం దానికే ఇంత భయపడ్డారేమండీ" డాక్టరుగారు నవ్వుతూ రామారావుని అడిగారు. రామారావు ముఖంకూడా వికసించింది.

"లేదండీ, నా కప్పుడే మృత్యువు రాదు!" అన్నాడు, గదిలో గాలి వెచ్చగా ఉంది. హాయిగా నిద్రపోయాడు రామారావు.

* * *

"ఇవాళ మహానందంలో ఒళ్లే మరిచేలాగ ఉన్నావు. ఆ చేతిలోనూ, మెడలోనూ పూలదండలు ఏమిటి? ముఖాన్ని చందనం పూసినట్టు నిండు సంతోషం. వాళ్ల పొగడ్తలకు పొంగిపోయినట్టున్నావు. ఏమిటి సంగతి?" అని చల్లగా గలగలా నవ్వుతూ గాలిలో ప్రశ్నించినట్టయింది. రామారావుకి.

"అప్పను ప్రమోషనుమీద పైఊరు పంపిస్తున్నారు. సంపూర్ణమైన బాధ్యత మన నెత్తిమీద పడింది. సంతోషానికి, సందేహాలకి సమయం కాదిది. స్వశక్తికి పరీక్ష. ఇది ఎలాగ నెగ్గుకొస్తానా అని ఆలోచిస్తున్నాను" అనుకున్నాడు రామారావు, తన శరీరాన్ని ఆక్రమించిన చల్లదనాన్ని ప్రక్కకి తోసేసుకుంటూ.

* * *

సగం నెరిసిన జుత్తు నుదుటి మీదకి పడ్తూంది. ముక్కుమీదకు జారిన కళ్ళద్దాలు ఒకచేత్తో సద్దుకుంటూ ఒకచేత్తో కర్ర ఆడించుకుంటూ రామారావు ఇంటికి తిరిగిరాగానే పెద్దకొడుకు ఎదురుగ్గా వెళ్ళి "నాన్నగారూ, నేను బి. ఏ ఫస్టుక్లాసులో ప్యాసయినానండీ" అన్నాడు.

ఒక స్టాక్ బ్రోకర్‌కి జబ్బు చేసింది. ఆస్పత్రిలో పడుకొని వున్నాడు. నర్సువచ్చి ఆతని టెంపరేచర్ గ్రాఫ్‌షీట్ మీద నోట్ చేస్తోంది.

"ఈ పూట టెంపరేచర్ ఎంత?" స్టాక్ బ్రోకర్ అడిగాడు

"నూటరెండు"

"నూటమూడుకి రాగానే సరకులన్నీ అమ్మేయించు" అన్నాడు ఆ స్టాక్ బ్రోకర్, మూలుగుతూ!

జి. వి. జి. కృష్ణ, మద్రాసు.


## నపుంసక తైలం

అంగనరములు బలహీనతచెంది చిన్నదైనా తిరిగి యథాప్రకారమై పూర్తి సౌఖ్యమును అనుభవించుటకు 48ఏండ్లుప్రఖ్యాతి చెందిన గ్యారంటీ మందు. 1 సీసా రూ 10/-లు. వి. పి. రూ 1-4-0

కావలసినవారు రు. 1/4 ముందుగా పంపేది

డా॥ రత్నం సన్సు మెడికల్ హాల్, మలకపేటబిల్డింగ్స్, హైద్రాబాదు-(దక్కన్)

# చల్లని తల్లి

"సరే. చాలా సంతోషమయింది. ఇంకా నువ్వెప్పుడు చెవిని వేస్తావో ఇటువంటి శుభవార్త అని ఎదురుచూస్తున్నాను!" అన్నాడు రామారావు రెండో కొడుకుని చూసి.

*     *     *

"కొడుకుల చదువులు అయితే పూర్తి, అయేవరకు బాధపడినా అర్థం ఉందికాని, కూతుర్నికూడా చదివిస్తున్నావే, ఇక ఎవడికో పెళ్ళిచేసి ఈ బాధ్యత వదిలించుకోవ?" అని చల్లగా గాలిలో గలగలా నవ్వుతూ ఎవరో ప్రశ్నించి నట్టయింది రామారావుకి.

"దానికి పెళ్ళిచెయ్యడం కాదు నా బాధ్యత. దాన్నికూడ విద్యావంతురాలిని చేసి ఏ ఉపాధ్యాయురాలుగానో, డాక్టరుగానో సమాజానికి సేవచేయగలిగేలాగు, తనంత తాను స్వేచ్ఛగా బ్రతకగలిగేలాగు చెయ్యాలని నాసంకల్పం!"

"నాకు తెలుసు నీ ఎత్తులు. ఈవిధంగా నీగడువుకాలం పొడిగించుకుందామని!"

"నీకు తెలియవు ఈ దేశంలో స్త్రీలు పడేబాధలు. ఒక పురుషుడికి కట్టుబడి, వాడి అర్జనలో ఎంతపోస్తే అంత త్రాగుతూ వాడు పెట్టేబాధలుభరిస్తూ, బిడ్డల్నికంటూ, బండచాకరీచేస్తూ బ్రతుకులు ఈడ్వలేని వీరికి కన్నతల్లికన్న నీవంటితల్లి అంటేనే ఎక్కువప్రీతి. వీరు ఆ శుభముహూర్తానికి ఎదురుచూస్తూవుంటారు"

"అయితే ఈదేశంలో ఇకముందు స్త్రీలు కూడా నన్ను ఎదుర్చుకొరన్నమాట!"

*     *     *

ఎదురుగా అద్దంలో తన ప్రతిబింబం చూసుకుంటున్నాడురామారావు, సోఫాలో కూర్చొని. ఇదోక కొత్తరూపం. ఇంకెవరిదో ఈ శరీరం. ఇందులో తను ఎలాగ ప్రవేశించాడో! తల నల్పుబడిపోయింది. ముఖం ముడతలుపడింది. ముక్కుమీద నులో నరాలు జారిపోతూ చూపే ఆనడం లేదు. నోరు తెరిచేందుకు భయంగా ఉంది. ముందరిపళ్లు ఊడిపోయాయి. శరీరంలో పటుత్వం లేదు. కూర్చుంటే లేవడానికి ఇష్టపడడంలేదు. ఏమయింది ఆరూపు? అపటుత్వం? అశక్తి? ఏమయినట్టు? ఎవరు చేసినది ఈ ఇంద్రజాలం? మృత్యువు!

గలగల నవ్వుతూ శరీరం ఝల్లుమనిపిస్తూ ప్రవేశించింది చల్లగాలి.

"పొరపాటు. మృత్యువుకాదు దీనికి కారణం నువ్వు కోరిన గడువు. కాలం. కాలంచేసిన మార్పు ఇది."

"కాదు. ఇదంతా నీ ప్రభావమే!- పదే పదే ఎదుటబడి క్రమక్రమంగా నీ ప్రభావానికి లోబరుచుకుంటున్నావు."

"అందుకనేనా ఆ చూపులు దొంగలాలో పలికి దాక్కుంటున్నాయి. నన్ను చూడగా కలిగిన అసహ్యం కారణంగానేనా ముఖంమీద ఆ ముడతలు? భయం చేతనేనా చేతిలోని కర్ర వణుకుతూంది?"

"నా శరీరంలోని శక్తి క్షీణింపచెయ్యగలిగేవు కాని, నా ఆత్మశక్తినో?"

"నేనుకాదు నీ శరీరాన్ని దుర్బలపరిచింది. చెప్పానుగదూ, నీ వయస్సు. ఇది నీ వృద్ధాప్యం. నిన్ను చూస్తే ఇప్పుడు నిజంగా నాకు దయ కలుగుతున్నది!"

"భయమా. నాకెందుకు భయం?"

"అదిగో నీకిప్పుడు సరిగా వినబడటం కూడా లేదు. నీ స్థితి చూస్తే దయ కలిగించేదిగా ఉన్నదీ అంటున్నాను."

"మృత్యువుకి దయ కూడానూ?"

"ఈరోజు నీకింత తీరికగా ఉందేం?"

"అవును. ఉద్యోగం సమాప్తి అయింది. మరెవరూ పనిలోనికి తీసుకోవడంలేదు."

"అవును మరి. ఈ వయస్సులో నువ్వు ఇంకేపని చెయ్యగలవు? ఇంట్లో కూచోక పోయిగా. నేను వస్తాను!"

గాలి విచ్ఛినయింది. రామారావు చేతికర్ర గట్టిగా పట్టుకొని గబగబా నడవడానికి ప్రయత్నిస్తూ బయటకు వెళ్ళాడు.


*     *     *

"ఈ నెలనుంచి పెద్దవాడు మూడు వందలు చిన్నవాడు రెండువందలు ఇస్తున్నారు. అమ్మాయి కూడా వంద రూపాయలు పంపిస్తూంది." అన్నది భార్య రామారావుతో.

"ఆధనం నీది. దానితో నాకేమీ సంబంధంలేదు. ఇంక నాకు ఈ బాధ్యత కూడా తీరింది. నేను సంపాదించి అమ్మకు ఇవ్వకపోయినా కొడుకులయినా ఇవ్వవద్దా?"

"మీ కంటికి అమ్మగా కనిపించేటంత ముసలిదాన్నయినాను అనేగా మీరు హాస్యం చేస్తున్నారు! ఒక్కసారి అద్దంలో చూసుకోండి మీ రూపం, ఎవరు ఎంత ముసలో తెలుస్తుంది!"

*     *     *



"కొత్త ఇల్లు...కొత్త కొత్త మనుష్యులు. కొత్త సామగ్రి. అంతా కొత్తగా మారిపోయినట్టు ఆనందిస్తున్నావు. నీ పాతవాసనలను ఎక్కడ దాచేసుకున్నావు?" అని గలగలా నవ్వుతూ చల్లగా గాలిలో ప్రశ్న.

"అబ్బే. ఇందులో నాదేముంది? ఇది పుత్రవాళ్లు కట్టించుకున్నది. వాళ్లే ఉంటున్నారు. వాళ్లకి పెళ్ళిళ్లు అయాయి. కొత్తవాళ్లు కొందరు కలిశారు ఈ కుటుంబానికి. సంఖ్య హెచ్చింది. అందుకని ఈ కొత్త ఇల్లు ఏదో దయదలచి నాకు కూడా కాస్త చోటు ఇచ్చారు ఏముంది. ఈ ముసలి ఘటానికి ఈ నాలుగురోజులూ ఎలాగ వెళ్లిపోయినా బాధలేదు!"

*     *     *

మేడమెట్లు దిగుతూ రామారావు కాలుజారి పడ్డాడు. కాలు విరిగింది. మంచం పట్టాడు. డాక్టరు ప్రతిరోజూ వచ్చి చూసిపోతున్నాడు. మందు ఇస్తున్నాడు. పదిహేనురోజు లయింది. రామారావు నానాటికి కృశిస్తున్నాడు.

గలగల నవ్వుతూ గాలిలో సుపరిచిత కంఠస్వరం ఆహ్వానిస్తున్నట్టు వుంది. ఆ ఆహ్వానంలో ఆకర్షణ ఈరోజు అనివార్యంగా ఉంది.

"ఆగు. ఒక్క క్షణం ఆగు. మా అమ్మ దగ్గర శెలవు తీసుకోవాలి!"

"అమ్మ. ఇంక అమ్మ ఎవరు?"

"నన్ను కన్నదీ తీసుకొన్నదే గాక, మధ్య సేవచేసినది, సుఖపెట్టినదీ జీవనయాత్రలో సహకరించినది మరొక అమ్మ ఉన్నది."

"ఓహ్హో భార్యనా అంత గొప్పగా పొగుడుకుంటున్నావు. సరే!"

"అమ్మా! అమ్మా! నాకు పిలుపు వచ్చింది. నా తల్లి పిలుస్తూంది. నన్ను తీసుకొని పోతుందిట!"

"మీరు. అట్టే మాటాడకూడదని డాక్టరు చెప్పారు."

"ఇంకా డాక్టరు ఆజ్ఞకు లొంగివుండవలసిన సమయం కాదిది. పిల్లలు ఏరీ?"

"నాన్నగారూ ఇక్కడే ఉన్నాం!"

"భయపడవద్దు బాబులూ! ఇంతవరకు ఈ జీవిత నాటకరంగంమీద తెరముందు నా అభినయం పూర్తిఅయింది. ఇక తెరవెనుకకు వెళ్ళి వేషం మార్చడానికి. ఇంక మీ అభినయం ప్రదర్శించాలి. అదుగో- ప్రాంప్టరు పడిపొమ్మంటున్నాడు. స్టేజి డైరక్టరు ఈలవేస్తున్నాడు. తెరవెనుక అమ్మ పిలుస్తూంది. తెరపడిపోయింది.?"

దబ్బుమని చప్పుడుతో వెండికట్టు చేతికర్ర నేలమీద పడింది. తెరచిన కిటికీ తలుపులోంచి చల్లని గాలివచ్చి ఎదురుగా దేవుడు సన్నిధిని వెలుగుతున్న దీపాన్ని ఆర్పివేసింది ఆరని వత్తులలోంచి పొగ వలయాలుగా తిరుగుతూ ఎగురుతూంది. ఆ వలయాల్లో నిలువెల్లా తెల్లని ముసుగుతో బిడ్డను చంకనిడుకొని హడావుడిగా వెనుతిరిగి వెళ్ళిపోతున్న తల్లివలె కనపడింది పొగ. కిటికీ ఊచల్లోంచి దాటగానే బయటనుండి పెద్దగాలి తలుపుల్ని ధడేల్ మని మూసేసింది బరువుగా పరుపులో దించుకొని పోయింది రామారావు కళేబరం.

"నాన్నగారూ!" అని అరచాయి మూడు యువకకంఠాలు:

"వారు మరి లేరు మనకు!" అన్నది ఒక వృద్ధవనిత గొంతు. ★




అద్దంలో మీ రూపం!

మీ చర్మాన్ని మీ రూపాన్ని రక్షించి, కాపాడుకొనుట అవసరం. చర్మాన్ని కాపాడుకొనుటకు మార్గం ఒకటే అని బుద్ధిశాలులగు బాలికలు గ్రహించిరి. వీరు ప్రతిరోజు హాజిలైన్ స్నోను "'Hazeline' Snow" తమ మృదువైన చర్మానికి ఉపయోగింతురు. ఇది చర్మంమీద ఆగి చర్మానికి మృదువుతనము, తెల్లదనము మరియు ప్రకాశాన్నియిచ్చును.




"'HAZELINE' SNOW"

(TRADE MARK)

"'హాజిలైన్' స్నో" (ట్రేడ్ మార్క్)

బరోస్ వెల్‌కమ్ అండ్‌కో (ఇండియా) లిమిటెడ్.

## నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిర్వీర్యత, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 15 అ.

పి. సి. ఏ. &కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి- నెల్లూరు జిల్లా.

సంపూర్ణ శరత్ సాహిత్యం

*40 పుస్తకాలలోనూ.

14 సంపుటములుగానూ...

వెలువడినాయి! వివరాలకు ....

దేశకవితామండలి. విజయవాడ2